సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



దట్టంగా పొగమంచు

సాక్షి,పాడేరు: మంచు దట్టంగా కురుస్తోంది. మినుములూరులో 12 డిగ్రీలు, అరకులోయలో 14 డిగ్రీలు, చింతపల్లిలో 14.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

8లో

జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.



పాడేరు, అరకు ఎమ్మెల్యేల ఔదార్యం

8లో

అనారోగ్యానికి గురైన వలంటీర్ పట్ల అరకు, పాడేరు ఎమ్మెల్యేలు ఔదార్యం చూపారు.

న్యూస్‌రీల్

నేడు పవనగిరి క్షేత్ర వార్షికోత్సవం

అడ్డతీగల: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన అడ్డతీగల పవనగిరి క్షేత్రం 19వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించనున్నట్లు క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. మానసాదేవి అమ్మవారి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉద్యోగాల పేరిట మోసగించిన ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది

జి.మాడుగుల: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి గిరిజన యువత నుంచి సొమ్ము కాజేసి మోసగించిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగాల పేరిట మండలానికి చెందిన చందూరు విష్ణుమూర్తి అలియాస్ విష్ణువర్ధన్, బూడిద చిన్నబ్బాయి అలియాస్ శ్రీనివాసరావు 2018లో 132 మంది నుంచి రూ.5లక్షలు నగదు తీసుకొని మోసగించినట్టు ఆయన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తప్పించుకుని తిరుగుతున్న వారిద్దరిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి

- తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి
- కుమ్మరివీధిలో ఘటన



దాడిలో తీవ్రంగా గాయపడిన సొన్నన్న (మృతి చెందక ముందు)

పెదబయలు: పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడికి పాల్పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని గోమంగి పంచాయతీ కుమ్మరివీధి (సంతబయలు) గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన కొంతేరి సొన్నన్న, గణపతి వరసకు అన్నదమ్ములు. వీరి మధ్య గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కొంతేరి సొన్నన్న ఇంటి వరండాలో కూర్చొని ఉండగా అతనిపై గణపతి ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. తల, ముఖం భాగాల్లో నరకడంతో సొన్నన్న తీవ్రంగా గాయపడ్డాడు. అతను కేకలు వేయడంతో భార్య, పిల్లలు వచ్చేసరికి గణపతి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న సొన్నన్నను మండలంలోని గోమంగి పీహెచ్‌సీకి కుటుంబ సభ్యులుతరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

కొయ్యూరు: జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం 9వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. 4 మిగులు సీట్లకోసం రెండు కేంద్రాల్లో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 1094 మంది రిజిస్టర్ చేసుకోగా 558 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజయ్ తెలిపారు.

మన్యం వైట్ బర్లీ.. అధరహో

మన్యంలో పండించే వైట్ బర్లీ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. నేల స్వభావాన్ని బట్టి ఇక్కడి పండించే పొగాకు పసిడి వర్ణంతోపాటు సువాసన కూడా ఉన్నందున మంచి గిరాకీ ఉంది. ప్రైవేట్ కంపెనీలు స్థానికంగా పోటీపడి కొనుగోలు చేయడంతో రైతులు వేసవి పంటగా కూడా సాగు చేస్తున్నారు. పెట్టుబడి పోను ఎకరాకు రూ.70 వేల మేర నికర ఆదాయం పొందుతున్నామని రైతులు తెలిపారు.

- అంతర్జాతీయ మార్కెట్లో భలే డిమాండ్
- కొనుగోలుకు పోటీపడుతున్న ప్రైవేట్ కంపెనీలు
- ఎకరాకు రూ.70 వేలకు పైగా ఆదాయం
- రెండు పంటలు పండిస్తున్న రైతులు



ప్రైవేట్ కంపెనీ కొనుగోలు చేసిన వైట్ బర్లీ పొగాకు బేళ్లు



రాజవొమ్మంగిలో ఏపుగా పెరిగిన వైట్ బర్లీ పైరు

రాజవొమ్మంగి: వైట్ బర్లీ పొగాకు సాగు మెట్ట ప్రాంత రైతులకు సిరులు కురిపిస్తోంది. ఏడాదిలో రెండు పంటలు పండటంతో రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. గతంలో కేవలం వర్షాధారంగానే పొగాకు సాగు చేసేవారు. ఇప్పుడు వేసవి పంటగా (తడుపు పొగాకు) కూడా సాగుచేస్తున్నారు. అధిక లాభాలు చేతికి వస్తుండటంతో ఈ పంటపైనే రైతులు మొగ్గుచూపుతున్నారు.

ఐటీసీ కంపెనీ ప్రాధాన్యం

- మన్యంలో పండిన పొగాకుకు మాత్రమే అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. దీంతో కంపెనీలు పోటీపడి కొనుగోలు చేస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా రైతులను ప్రోత్సహిస్తున్నాయి. వైట్‌బర్లీ పొగాకును సిగరెట్ల తయారీలో ఉపయోగిస్తారు. ప్రముఖ కంపెనీ ఐటీసీ మన్యంలో పండించిన పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తోంది.
- రాజవొమ్మంగి మండలంలో జడ్డంగి, అమీనాబాద్, జెడ్డంగి అన్నవరం, కింద్ర, లబ్బర్తి, లాగరాయి, శరభవరం, చికిలింత, కరుదేవపాలెం, వంచంగి తదితర గ్రామాల్లో రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. జిల్లాలో కొయ్యూరు మండలంలోని గ్రామాల్లో కూడా రైతులు పండిస్తున్నారు. జిల్లా మొత్తంమ్మీద దాదాపు 2 వేల ఎకరాల్లో పండిస్తున్నారు.

క్వింటాల్ ధర రూ.11 వేలు

- వైట్ బర్లీ పొగాకు క్వింటాలు ధర రూ.11 వేలు పలుకుతోంది. ఎకరాకు 6 వందల కిలోల నుంచి వెయ్యి కిలోల వరకు దిగుబడి సాధిస్తున్నారు. మెరుగైన ఆదాయం రావడంతో రైతులు ఇతర వాణిజ్య పంటల కన్నా ఈ సాగుపైనే ఆధారపడుతున్నారు.
- మిగతా పంటల మాదిరిగా పొగాకు సాగుకు పశువులు, కోతులు, ఇతర అడవి జంతువుల బెడద తక్కువ. ఆకులు చేదుడగా ఉన్నందున మేకలు, గొర్రెలు ఈ పంటజోలికి పోవు. మొక్క నాటింది మొదలు చీడపీడల నివారణపై కాస్త దృష్టి సారిస్తే సరిపోతుంది.

స్థానికంగానే మార్కెటింగ్

- మార్కెటింగ్ స్థానికంగా అందుబాటులో ఉంది. పొగాకు ఆకులను బేళ్లుగా తయారు చేసి స్థానికంగానే ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. పొగాకు అమ్మిన 24 గంటల్లోనే రైతు చేతికి నగదు అందుతోంది. దీంతో ఈ పంట మేలని రైతులు భావిస్తున్నారు. అందువల్ల ఇంటిల్లపాది సాగు పనుల్లో తలమునకలై ఉంటారు.

ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి

- మూడు నెలల సమయంలోనే పొగాకు పంట చేతికి వస్తుంది. ఎకరాకు సుమారు రూ. 70 వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి దాదాపు రూ.20వేలు పోగా మిగిలినదంతా ఆదాయమే. అందువల్లనే అధికశాతం రైతులు ఈ సాగుపై ఆధారపడ్డారు. రైతులనుంచి ప్రధానంగా ఐటీసీ కంపెనీ కొనుగోలు చేస్తోంది. అమ్మకాలు చివరి దశకు చేరుకున్నాయి.

రంగు, సువాసన ప్రత్యేకత

ఏలేశ్వరం బర్లీగా పిలిచే మన్యం పొగాకును సిగరెట్ల తయారీలో ఉపయోగిస్తారు. సిగరెట్ల తయారీలో మరో రకం పొగాకుతో వైట్ బర్లీని కలిపితేనే కాల్పు బాగుంటుంది. నేల స్వభావాన్ని బట్టి ఇక్కడి పండించే పొగాకు పసిడి రంగులో ఉంటుంది. సువాసన ఉంటుంది.

– తారక్, మేనేజర్, ఐటీసీ కంపెనీ, రాజవొమ్మంగి

‘ఏకలవ్య’ సేవలు అభినందనీయం

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి



పవర్ టిల్లర్లను అందజేస్తున్న సరస్వతి తదితరులు

పాడేరు రూరల్ : జిల్లాలో ఏకలవ్య ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ మినుముల సరస్వతి అన్నారు. కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మినుములూరు గ్రామంలో 11 గ్రామాల గిరిజన రైతులకు పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ గంగయ్య మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2019 నుంచి పాడేరు మండలం మినుములూరు, వనుగుపల్లి పంచాయతీ పరిధిలోని 20 గ్రామాల్లో వాటర్ షెడ్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకంలో వృథాగా పోతున్న ఊటనీటిని వ్యవసాయానికి మళ్లించేలా చెక్‌డ్యాంలు, కాలువలు నిర్మించామని చెప్పారు. వీటి ద్వారా 760 ఎకరాలకు సాగునీరు అందించినట్టు తెలిపారు. భూమి లేని 162 మంది నిరుపేద గిరిజన కుటుంబాలకు మేకలు, కిరాణా, కుట్టు మిషన్లు అందించి జీవనోపాధి కల్పించామన్నారు. ప్రస్తుతం వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు చేసేందుకే రైతులకు వీడర్లు, పవర్ టిల్లర్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జీపీవో పుల్లయ్య, ప్రాజెక్టు హెడ్ బి. విజయ్, సర్పంచ్‌లు లంకెల చిట్టమ్మ, మాదెల రవణమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్ల నియామకం

పాడేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కోకన్వీనర్లను శనివారం ఆ పార్టీ ప్రకటించింది. జిల్లాలోని పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 10 మండలాల్లో కన్వీనర్లు, కోకన్వీనర్ల నియమించింది. అన్ని వర్గాల వారికి అవకాశం కల్పించింది.

పాడేరు అసెంబ్లీ..

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో చింతపల్లి మండల కన్వీనర్‌గా కిల్లో పితంబరం, కో-కన్వీనర్లుగా జల్లి రవి, పెదపూడి మధు, కురుసా తిరుపతి, తమర్బ కృష్ణమూర్తి, పాడేరు మండల కన్వీనర్‌గా కతారి పూర్ణచంద్రనాయుడు, కో-కన్వీనర్లుగా సీదరి రాంబాబు, కొట్టగుళ్లి కొండాజీ, పిట్టా నవీన్‌కుమార్, కిల్లో నటరాజ నాయుడును నియమించింది. కొయ్యూరు మండల కన్వీనర్‌గా దడాల రమేష్, కో కన్వీనర్లుగా చీలుగు ఆశయ్య, నాతూరి సోమయ్యదొర, ఆర్. లక్ష్మి దార రమేష్, కల్లా మరిడేశ్వరరావు, జీకే వీధి మండల కన్వీనర్‌గా అరకట్టి నాగరాంజనేయులు, కో-కన్వీనర్లుగా పోతురాజు కృష్ణమూర్తి, నడిగట్ల రాజు, వనపల రాజేష్, లంబసింగి రమేష్, జి.మాడుగుల మండల కన్వీనర్‌గా లంకెల కల్యాణ్, కో-కన్వీనర్లుగా గబ్బాడి సన్యాసిదొర, చల్లంగి గోపాల నర్సింహప్రసాద్, మాతే వెంకటరమణ, కిముడు సన్యాసిదొర నియమితులయ్యారు.

అరకు అసెంబ్లీ..

అనంతగిరి మండల కన్వీనర్‌గా పాంగి సత్యనారాయణ, కో-కన్వీనర్లుగా సిరగం రాజారావు, రూఢీ లక్ష్మణ్, కంతా రాజు, కొర్రా ఉత్తర్‌కుమార్, అరకువేలి మండల కన్వీనర్‌గా సమర్డీ రాజు, కో కన్వీనర్లుగా కొర్రా రమేష్, జన్ని అర్జున్, కిల్లో రఘురామ్, పాంగి బాబూరావు, డుంబ్రిగుడ మండల కన్వీనర్‌గా కిల్లో లవకుశ, కో కన్వీనర్లుగా శెట్టి శ్రవణ్, వంతాల మోహన్‌రావు, కిల్లో రమేష్, వంతాల లవకుశను నియమించింది. హుకుంపేట మండల కన్వీనర్‌గా భూషణ్, కో కన్వీర్లుగా కోటిబాబు, రాప పంచాయతీకి చెందిన ఒకరు, ముంచంగిపుట్టు మండల కన్వీనర్‌గా పులి రాజు, కో కన్వీనర్లుగా కోడా విక్రమ్, కూడా కోటేశ్వరరావు, జి. సింహాద్రి, సోనియాలను ఆపార్టీ నియమించింది.

జిల్లా విద్యాశాఖాధికారిగా శామ్యూల్

సాక్షి, పాడేరు: స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.శామ్యూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఇక్కడ డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ పి.రమేష్‌ను ప్రభుత్వం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పల్లిపాడు డైట్ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. గత రెండేళ్ల నుంచి డీఈవోగా ఆయన ఉత్తమ సేవలందించారు. తొలుత పాడేరు ఐటీడీఏ పరిధిలోని డీఈవోగా పనిచేసిన రమేష్‌నుకొత్తజిల్లాల ఏర్పాటు అనంతరం డీఈవోగా ప్రభుత్వం నియమించింది.

‘పసిడి’ తళుకులు



సీలేరు రెగ్యులేటరీ డ్యామ్ వద్ద శనివారం సాయంత్రం వేళ అందమైన దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యాస్తమయ వేళ కిరణాలు రెగ్యులేటరీ డ్యామ్ వద్ద నీటిని తాకుతూ కనువిందు చేశాయి. పసిడి వర్ణంలో మెరిసిపోయాయి. ఈ దృశ్యాన్ని సీలేరు సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ తన కెమెరాలో బంధించారు.

– సీలేరు

బాధిత కుటుంబాలకు సత్వర సాయం

- తక్షణ పరిహారం అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు
- ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల మేర ఆర్థిక సాయం
- వైఎస్సార్ బీమా వర్తింపునకు కృషి
- పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ
- బాధిత కుటుంబాలకు పరామర్శ



కృష్ణారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణ



లక్ష్మీపురం గ్రామానికి వెళుతున్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు/పెదబయలు: ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు సత్వరసాయం అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన లక్ష్మీపురానికి చెందిన వెచ్చంగి నర్సింగరావు, వెచ్చంగి కృష్ణారావు, వెచ్చంగి సాగర్, వంచేడిపుట్టుకు చెందిన కుర్తాడ బొంజుబాబు, చంపాపుట్టుకు చెందిన కొర్రా రామారావు మృతదేహాలకు కుటుంబ సభ్యులు శుక్రవారం అర్ధరాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఈనేపథ్యంలో శనివారం ఆయా గ్రామాలకు పాడేరు, అరకు ఎమ్మెల్యేలు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి పరిస్థితిని చూసి చలించిపోయారు. ప్రభుత్వం, తాము అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదుగురు గిరిజనుల మృతిపై సీఎం వెంటనే స్పందించారన్నారు. ప్రభుత్వం తరపున రూ.25 లక్షలు, ఆయిల్ ఫ్యాక్టరీ తరపున రూ.25 లక్షలు ఒకొక్క బాధిత కుటుంబానికి అందిస్తామని చెప్పారు. వైఎస్సార్ బీమా పథకం రూ.5 లక్షలు మృతుల కుటుంబాలకు వర్తింపుజేస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబాల సమగ్ర వివరాల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పిల్లల చదువులకు సంబంధించి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. మృతుల కుటుంబాలకు చెందిన బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. చంపాపుట్టులో మినీ అంగన్‌వాడీ కేంద్రం వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వలస వెళ్లిన వారందరినీ గ్రామాలకు రప్పించి స్థానికంగా ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధిత కుటుంబాలకు అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు అండగా నిలిచి, ధైర్యం కల్పించాలని కోరారు. సర్పంచ్‌లు చెండా రవిశంకర్, మత్స్యరాజు, ముంచంగిపుట్టు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య పాల్గొన్నారు.

లాభాల కిత్తనార

- నారుతీతతో గిరిజనులకు ఆదాయం
- కట్ట రూ.50కు కొనుగోలు
- మైదాన ప్రాంతాలకు ఎగుమతి



డుంబ్రిగుడ ప్రాంతంలో కిత్తనార మొక్కల నుంచి నారను సేకరిస్తున్న గిరిజనులు



కిత్తనార మొక్కలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కిత్తనార వ్యాపారం జోరందుకుంది. ప్రస్తుతం కిత్తనార అమ్మకాలతో గిరిజనులకు ఆదాయం నెలకొంది. కట్ట నారు రూ.50తో అమ్మకాలు జరుపుతున్నారు. ప్రతి గిరిజన రైతు ఈ సీజన్‌లో కిత్తనార అమ్మకాల ద్వారా వారానికి రూ.2వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఏజెన్సీలో గిరిజనులు కిత్తనారను సేకరించి నారతీసి ఎండబెట్టి విక్రయిస్తుంటారు.

విస్తారంగా పెంపకం

ఏజెన్సీలోని భూమి కోతల నివారణ, భూసార పరిరక్షణకు కిత్తనార దోహదం చేస్తుంది. ఏజెన్సీలో అధికంగా ఉండే కిత్తనార మొక్కలు ఈ సీజన్‌లో గిరిజనులకు మంచి ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. అటవీశాఖతో పాటు గిరిజనులంతా ఎక్కడికక్కడ తమ వ్యవసాయ భూముల్లో కిత్తనార మొక్కలను భూసార పరిరక్షణకు వేసుకున్నారు. అటవీశాఖ వన సంరక్షణ సమితుల్లో కూడా కిత్తనారను భారీగానే గతంలో నాటింది. కిత్తనార మొక్కలు ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను అధికంగా ఉన్నాయి.

మైదాన ప్రాంతాలకు తరలింపు

కిత్తనారతో తయారు చేసిన తాడులను పొగాకు కట్టలు కట్టేందుకు పూర్వం నుంచి వ్యాపారులు ఉపయోగిస్తున్నారు. గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు ప్రాంతాల్లో పొగాకు సాగు అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఏజెన్సీలోని గిరిజన రైతులను కిత్తనార సేకరించేందుకు అక్కడ వ్యాపారులంతా ప్రోత్సహిస్తున్నారు. గిరిజనులు మంచి ఆదాయం పొందుతున్నారు. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, అరకులోయ, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో ప్రస్తుతం కిత్తనార వ్యాపారం భారీగా జరుగుతోంది. వ్యాపారులు స్థానికంగా మకాం వేసి, లారీలు, వ్యాన్ల ద్వారా కిత్తనారను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. మే నెల వరకు కిత్తనార వ్యాపారం మన్యంలో జరుగుతుంది.

ఏటా ఆదాయం



కిత్తనార అమ్మకంతో ఏటా ఆదాయం పొందుతున్నా. పదిరోజుల్లో సేకరించిన కిత్తనారతో ఇప్పటికి రూ.2 వేల ఆదాయం వచ్చింది. వ్యాపారులు నేరుగా గ్రామాలకు వచ్చి కిత్తనార కట్టలను కొనుగోలు చేస్తున్నారు. కట్టకు రూ.50 చెల్లిస్తున్నారు.

– కిముడు చిన్నయ్య, గరుడాపల్లి, హుకుంపేట మండలం

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన


కేసులు పరిశీలిస్తున్న లోక్ అదాలత్ స్పెషల్ జడ్జి సాయికృష్ణ

పాడేరు రూరల్ : జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. దీనిలో భాగంగా స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి నిఖిత సింగర్ 13 కేసులు పరిష్కరించారు. పాడేరు కోర్టు పరిధిలో ఆయా కేసులకు సంబంధించి ఇరువర్గాలతో మాట్లాడి రాజీ కుదిర్చారు. పలు కేసుల్లో నిందితులు నేరం అంగీకరించడంతో జరిమానా విధించారు. ఆ కార్యక్రమంలో పాడేరు కోర్టు ఏపీపీ వాగుపల్లి రమేష్, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు తమర్భ ప్రసాద్‌నాయుడు, న్యాయవాదులు ఉల్లి సింహాచలం, జీవీ రమణ, శేషు, పాడేరు సీఐ సుధాకర్, పాడేరు ఎస్ఐలు లక్ష్మణ్, రంజిత్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగలలో 24 కేసులు..

అడ్డతీగల: జాతీయ లోక్‌అదాలత్‌లో 24 కేసులు పరిష్కరించనట్టు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్ డియో తెలిపారు. శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఎనిమిది క్రిమినల్, రెండు కుటుంబ తగాదా, మరో 14 వివిధ నేర అంగీకార కేసులు పరిష్కరించినట్టు ఆయన వివరించారు. న్యాయవాదులు కేఎస్‌వీ రమణ, డి.శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- అరకులోయలో 26 కేసులు

అరకులోయ రూరల్: లోక్ అదాలత్‌తో కేసులు సత్వర పరిష్కారం అవుతాయని లోక్ అదాలత్ స్పెషల్ జడ్జి సాయికృష్ణ అన్నారు. స్థానిక ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఆయన అధ్యక్షతన శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. అరకు, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధిలోని 26 కేసులు పరిష్కరించారు. మొత్తం కేసులకు సంబంధించి రూ.1,03,400 జరిమానా విధించారు. వీటిలో ఎక్సైజ్ కేసులు 14 కాగా వీటికి రూ.3,400, భార్యాభర్తల కేసులో రూ.లక్ష జరిమానా విధించినట్టు స్పెషల్ జడ్జి సాయికృష్ణ తెలిపారు. అరకులోయ సీఐ జీడిబాబు, అనంతగిరి ఎస్ఐ రాము, న్యాయవాదులు మురళీమోహన్, రత్నంరాజు, రాంబాబు, ప్రభాకర్, సింహాచలం, ప్రేమ్‌చంద్, నారాయణరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగికి అరకు ఎంపీ నివాళి


ఆనందరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ మాధవి

పాడేరు రూరల్ : జిల్లాలోని జీకే వీధి మండలం దామునాపల్లి గ్రామానికి చెందిన జీవీఎంసీ ఉద్యోగి ఎ.ఆనందరావు మృతికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనారోగ్యంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆనందరావు శనివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎంపీ గొడ్డేటి మాదవి కేజీహెచ్‌కు చేరుకొని ఆనందరావు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని తాను అండగా ఉంటానికి వారికి భరోసా కల్పించారు. కొంత ఆర్థిక సహాయాన్ని ఆనందరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక అంబులెన్స్ సమకూర్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారు.

పాడేరు, అరకు ఎమ్మెల్యేల ఔదార్యం

- వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబుకు పరామర్శ
- విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు


వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబును పరామర్శిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు

సాక్షి,పాడేరు: పాడేరు మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న వలంటీర్, వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు ఎముకుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ మేరకు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నాడు. రాంబాబు అనారోగ్య పరిస్థితిపై పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణలు చలించారు.తన నివాసానికి శనివారం వచ్చిన వలంటీర్ల సంఘం నేతలకు అరకు ఎమ్మెల్యే రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే ఫోన్‌లో రాంబాబును ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శించి,యోగక్షేమాలను తెలుసుకున్నారు.పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కూడా రాంబాబుకు ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే భర్త, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నరసింగరావు శనివారం విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి రాంబాబును పరామర్శించారు. రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శస్త్రచికిత్స అనంతరం పాడేరు వచ్చేందుకు వాహనం సమకూరుస్తానని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనకు ఫోన్ చేయాలని రాంబాబు, అతని భార్యకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. సోషల్ మీడియా ప్రతినిధి నగేష్ ఉన్నారు.ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం నేత సురేష్‌బాబు మాట్లాడుతూ రాంబాబు అపరేషన్‌కు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని, 9441045820 నంబర్‌కు సంప్రదించి, దాతలు సాయం చేయాలని కోరారు.

ఉత్సాహం ఉరకలు.. జోరుగా పరుగులు

- ప్రారంభమైన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ స్థాయి పోటీలు
- జూనియర్స్, సీనియర్స్ విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత


ఎంవీజీఆర్ కళాశాల, విజయనగరం


సాయిగణపతి పాలిటెక్నిక్, విశాఖపట్నం


శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, తూర్పుగోదావరి


ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి' ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ ప్రాంతీయ స్థాయి పోటీలు శనివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించేందుకు ఆదివారం సీనియర్స్ విభాగంలో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టుతో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తలపడనుంది. జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టుతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టు పోటీ పడనుంది.

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

ఐదు వికెట్ల తేడాతో..

సీనియర్స్ విభాగంలో జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ ఓడిన ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల(శొంఠ్యాం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. ఓపెనర్ సునీల్ 39 పరుగులు చేశాడు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు(విజయనగరం) రెండు వికెట్లు కోల్పోయి 8.1 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ రవికుమార్ 38 పరుగులతో నిలిచాడు.

హోరాహోరీ పోరులో..

జూనియర్స్ తొలి మ్యాచ్‌లో సాయి గణపతి పాలిటెక్నిక్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లకు 84 పరుగులు చేసింది. నూకేష్(56) ఎనిమిది ఫోర్లతో అర్ధ సెంచరీ చేశాడు. సతీష్, గౌతమ్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఆర్‌కే జూనియర్ కళాశాల(పార్వతీపురం) జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయగలిగింది. చిరంజీవి 33, సంజయ్ 23 పరుగులు చేశారు. తేజ, లోకేష్ చెరో వికెట్ తీశారు.

లక్ష్యసాధనలో..

జూనియర్స్ రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల(పలాస) ఐదు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. సాయికృష్ణ 45 పరుగులు చేశాడు. చరణ్‌సాయి రెండు, యశస్వి ఓ వికెట్ తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ కళాశాల(పెద్దాపురం) జట్టు ఏడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ సూర్య దిలీప్ 47 పరుగులు చేశాడు. వాసు, యుగంధర్ చెరో వికెట్ తీశారు.


అర్ధసెంచరీ చేసిన సాయి యశ్వంత్

అర్ధసెంచరీ తేడాతో..

సీనియర్స్ విభాగం రెండో మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు నాలుగు వికెట్లకు 121 పరుగులు చేసింది. సాయి యశ్వంత్(60) ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ చేయగా షరోన్ 45 పరుగులు చేశాడు. రవికుమార్, వంశీ చెరో వికెట్ తీశారు. ప్రతిగా ఐడియల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(కాకినాడ) జట్టు మూడు వికెట్లు కోల్పోయి 70 పరుగులే చేసి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సూర్య చైతన్య 41 పరుగులు చేశాడు. యశ్వంత్ రెండు వికెట్లు తీశాడు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పాయకరావుపేట : పట్టణ సమీపాన జాతీయ రహదారిపై వై జంక్షన్ వద్ద లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. బుచ్చియ్యపేట మండలం, సీతయ్యపేట గ్రామానికి చెందిన పిల్ల రమేష్ అనే వ్యక్తి తన మోటారు సైకిల్‌పై రోడ్డుకి ఎడమ పక్కన (అనకాపల్లి వైపు) ప్రయాణిస్తుండగా, అదే మార్గంలో వెనుకనుంచి అతివేగంగా ప్రయాణిస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో రమేష్‌కు కాలు నుజ్జునుజ్జు అయింది. వెంటనే 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.